క్లుప్తంగా

రేపు కొత్త పింఛన్ల పంపిణీ

పిఠాపురం: ప్రభుత్వం పెంచిన కొత్త పింఛన్లను గురువారం పిఠాపురం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పంపిణీ చేయనున్నట్లు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. ప్రస్తుతం పింఛనుదారులకు రూ.2750 నుంచి రూ.3వేలకు పెంచిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు కొత్త పింఛన్లను పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



సామర్లకోట బీబీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ట్యాబ్‌లు అందజేస్తున్న కౌన్సిలర్

సామర్లకోట: 8వ తరగతి నుంచి విద్యార్థులకు సాంకేతిక విద్య అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బీబీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట కందకం ప్రాంతానికి చెందిన నాతి చిట్టిరాజు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిట్టిరాజు కొంత కాలంగా విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్నాడు. స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్స్ సమీపంలోని పొలంలో వ్యవసాయ పనులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తూ ఉండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దాంతో శరీరం అంతా కాలిపోయింది. తోటి సిబ్బంది చిట్టిరాజును హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

కొత్తపల్లి: భర్తతో గొడవపడి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఒక మహిళ మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరగిరి గ్రామానికి చెందిన నక్కా విజయలక్ష్మి(38) మంగళవారం ఉదయం తన భర్త మాధవకృష్ణతో గొడవపడింది. దీంతో ఆమె మనస్థాపానికి గురై పురుగుల మందు తాగడంతో అస్వస్థకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గండేపల్లి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు సూరంపాలెంకు చెందిన లావేటి సత్యనారాయణ గ్రామ శివారులో సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి జరిపి అతనిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలియజేశారు.

సారా తరలిస్తుండగా..

జగ్గంపేట: అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జె.కొత్తూరుకు చెందిన కేసుబోయిన వీర్రాజు పది లీటర్ల సారాను తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో గ్రామ శివారులో అతనిని అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

గోకవరం: పేకాట ఆడుతున్న ఆరుగురి వ్యక్తులను సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేసినట్టు ఎస్సై శివనాగబాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోకవరం ఊరి శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంతో మాటు వేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.23140 నగదు, రెండు ప్లేకార్డుల సెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

శంఖవరం: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మంగళవారం జి.కొత్తపల్లి హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు ఉపయోగించుకుని సాంకేతికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు, ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోతాదు మించితే అనర్థమే..

- అధికంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం
- మేల్కొనకపోతే ముప్పు తప్పదంటున్న అధికారులు



ఎరువులు చల్లుతున్న రైతు

కొత్తపల్లి: ఎరువులు, పురుగు మందులను అధిక మోతాదులో వినియోగిస్తుండడం వల్ల నేల కాలుష్యం ఏర్పడి భూములు నిస్సారవంతంగా మారుతున్నాయి. వీటిలో పండించే పంట ఉత్పత్తులపై రసాయనాలు ప్రభావం పెరిగి కొత్త రకం తెగుళ్లు పుట్టుకురావడంతో పాటు ఆహార నియమావళిని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం కూడా ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. శక్తివంత మైన మందుల వాడకం పెరిగిపోవడంతో రైతుకు అన్ని విధాలా నష్టం చేకూర్చే ప్రతికూల పరిస్థితులు ఎదరవుతున్నాయి. ఈ దుష్ఫలితాలు పోవాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం పెంచడంతో పాటు భుసార పరీక్షలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు వినియోగిస్తే ఆశించిన దిగుబడి సాధ్యమవుతుందని వ్యవసాయ నిపుణులే పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో 15200 హెక్టార్లలో వరి సాగు

పిఠాపురం నియోజకవర్గం పరిధిలో రబీలో 15200 హెక్టార్లు వరిసాగు జరుగుతోంది. కొత్తపల్లి 4647, గొల్లప్రోలు 2857, పిఠాపురం 7694 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు. రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. అన్నిచోట్ల వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ఎరువులు, పురుగు మందులు వినియోగంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

లైను ఊడ్పులకు ప్రాధాన్యం

రైతులు ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఊడ్చే లైన్ ఊడ్పు(తాడు ఊడ్పు)నకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నియోజకవర్గంలో 40శాతం పైగా రైతులు ఊడ్పులే చేపట్టారు. బీహార్, బెంగాల్, మహారాష్ట్ర ఇతర రాష్ట్ర కూలీలతో పాటు మన రాష్ట్రంలో నెల్లూరు, గుంటూరు నుంచి అధిక సంఖ్యలో కూలీలు వ్యవసాయ పనుల కోసం వలస వస్తున్నారు.



తాడు ఊడ్పు ఊడుస్తున్న అన్నదాత

ఖర్చు ఆదా

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు వ్యవసాయ పనులు చేయడం వల్ల రైతులకు కూలీల ఖర్చు కొంతవరకూ ఆదా అవుతుంది. పనిభారం కూడా తగ్గుతుంది. 16 నుంచి 20 రోజుల వ్యవధిలో వేసిన నారుమడులను ఆకు తీసుకుని వారే ఊడ్పు అప్పగిస్తారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులు భూసార పరీక్షల ఆధారంగానే పంట సాగుతో పాటు ఎరువుల వినియోగించాలి. అనవసర వాడకం అధికమైతే భూమి నిస్సారం పెరిగి చౌడు మారే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువులు వినియోగంపైనే రైతులు దృష్టి సారించాలి. దీంతో భూసారం పెరిగి ఆశించిన దిగుబడులు చేతికందుతాయి. రైతులు ఈ దిశగా ఆలోచించాలి. పంట సాగులో అధికారుల సలహాలు, సూచనలు తప్పని సరిగా పాటించాలి.

–జోగిరాజు,
మండల వ్యవసాయశాయ అధికారి, కొత్తపల్లి

హెచ్ఐవీ బాధిత చిన్నారులను ఆదుకోవాలి

పెద్దాపురం: హెచ్ఐవీ బాధిత చిన్నారులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సూర్యకుమారి అన్నారు. మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, కుంచే ఏసుబాబుల ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు సుమారు రూ.500 విలువైన పోషకాహార కిట్లను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెంట్ సూర్యకుమారి మాట్లాడుతూ ఇటువంటి పిల్లలను గుర్తించి వారిని ఆదుకున్న మానవ హక్కుల సంఘం సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సంఘ సేవలను విస్తృతం చేయడంలో మానవ హక్కుల సంఘం నాయకులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అప్పలకొండ, నానిబాబు మాట్లాడుతూ విదేశాల్లో ఉంటున్న మానవ హక్కుల సంఘం పరిరక్షణ కమిటీ సభ్యురాలు రాణి ఆర్థిక సాయంతో మహిళా ప్రతినిధి కాశీ చంద్రావతి ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఇటువంటి చిన్నారులను సమాజం కించపరచకూడదని, సహృదయ భావంతో ప్రతి ఒక్కరూ చిన్నారులను ఆదుకోవాలని వారు కోరారు. అనంతరం చిన్నారులకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జుత్తుక అప్పారావు, ఎండీ వలీబాషా, ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాస్, రమాదేవి, శ్వేత, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



సామర్లకోట జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



క్రికెట్ మ్యాచ్‌లో పోటీ పడుతున్న ఆటగాళ్లు

సామర్లకోట: గ్రామీణ స్థాయి యువతీ, యువకులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. రెండు రోజుల విరామం అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టణ పరిధిలోని క్రీడాకారులు, క్రికెట్, కబడ్డీ పోటీల్లో పాల్గొన్ని తమ ప్రతిభను కనబర్చారు. పోటీల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజులు పర్యవేక్షించారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టరు వెంకటేశ్వర్లు క్రీడాకారులచే ఆటలను ఆడిస్తున్నారు. ఈ నెల ఆరో తేదీ వరకు సచివాలయాల స్థాయిలో ఆటల పోటీలు జరుగుతాయని కమిషనర్ రామారావు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని మండల స్థాయికి ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

బుద్ధావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు బుద్ధావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అక్షతల వితరణ

ఏలేశ్వరం: అయోధ్య రామయ్య అక్షతలు పట్టణంలో మంగళవారం వితరణ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో భద్రపరిచిన అక్షతలను పాతబస్టాండ్ వద్ద వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. స్థానిక మెయిన్‌రోడ్ బాలాజీచౌక్, హనుమాన్‌జంక్షన్ మీదుగా వందలాది మందితో ఊరేగింపుగా వచ్చి అక్షతలను భక్తులకు అందజేశారు. రామ ఆలయ క్యాలెండర్, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి కటకం కిరిటి, ఏడీపీ ప్రసాద్ మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



పట్టణంలో నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా నగర సంకీర్తన

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దాపురం పట్టణంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాండ్రకోట గ్రామం నుంచి పట్టణంలోని విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కాండ్రకోట వారిచే పట్టణంలో వేకువజాము నుంచి భక్తులు ధనుర్మాస పూజలు, లక్ష తులసి పూజ, లక్ష కుంకుమ పూజతో పాటు నగర సంకీర్తనలు నిర్వహించారు. వైకుంఠ మండప సేవ మొదలైన పూజలను నిర్వహించారు. అలాగే పట్టణంలోని శ్రీ సీతారామ రామనామ నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో పుర వీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు.

చెత్త సమస్య తీరేదెలా?

- కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజల ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గం చూడాలని వేడుకోలు



సామర్లకోటలో పేరుకుపోయిన చెత్త

సామర్లకోట: పట్టణంలో అనేక వార్డుల్లో చెత్త పేరుకుపోయింది. బుధవారం నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పారిశుధ్య పనుల్లోనూ, ప్రజా ప్రతినిధుల ఇళ్ల వరకే కార్మికులు పరిమితమైపోయారు. తాజాగా సమ్మె నోటీసు ఇవ్వడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెకు దిగుతున్నట్లు పారిశుధ్య కార్మిక సంఘ అధ్యక్షుడు బొచ్చా శ్రీను స్థానిక విలేకర్లకు తెలిపారు. సంక్రాంతి పండగ సీజన్‌లో వారు సమ్మెకు దిగితే చెత్త మరింత పెరిగి పోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద పండగ కావడంతో ఇంటిని శుభ్రం చేసుకుంటారు. దీంతో ఇళ్లలోని చెత్తంతా వీధుల్లోనే తాండవిస్తుంది. కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని ప్రజలు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

అన్నింటా విజయం సాధించాలి



టీ షర్ట్స్, క్యాప్‌లను కార్యదర్శులకు అందజేస్తున్న ఎంపీపీ

గండేపల్లి: క్రీడాకారులు అన్నింటా విజయం పొందాలని ఎంపీపీ చలగల్ల దొరబాబు అన్నారు. ఆడుదాం –ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఐదు రకాల క్రీడల్లో గ్రామస్థాయిలో పాల్గొని మండల స్థాయి పోటీల్లో స్థానం దక్కించుకున్న క్రీడాకారులకు టీ షర్ట్స్, కేప్‌లను మంగళవారం ఆయన చేతుల మీదుగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేసి క్రీడాకారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్, ఈఓపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు సూర్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్రకు అంతిమ ఘడియలు వచ్చాయి

డాక్టర్ ఉమర్ ఆలీషా



వాహనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చిన మార్పులు ఉద్యోగాలు వ్యాపారాలు వంటి కారణాలతో బంధువులు అందుబాటులో లేకపోవడంతో అంతిమయాత్రకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. బుధవారం పిఠాపురంలో మన ఊరు–మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాత వెన్నపు చక్రధరరావు అందించిన అంతిమయాత్ర వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి సేవ చేయడానికి ముందుకు వచ్చిన మనఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. గతంలో దాత ఇచ్చిన వాహనం మరమ్మతులకు గురై పని చేయకుండా పోవడంతో కొత్త వాహనాన్ని దాత వెన్నపు చక్రధరరావు సమకూర్చారని సంస్థ సభ్యులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్ తెలిపారు.

సీఎం రాకకు సర్వం సిద్ధం



కాకినాడ ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

- పర్యటన ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష
- రోడ్‌షో, బహిరంగ సభ స్థలం తదితర ప్రాంతాల పరిశీలన

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం సమీక్షించారు. బుధవారం ఉదయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ రానున్న నేపథ్యంలో చేపట్టనున్న ఏర్పాట్లపై అధికారులతో సమావేశమయ్యారు. తొలుత బహిరంగ సభ జరిగే ఆర్ఎంసీ గ్రౌండ్స్‌ను అధికారులు, జిల్లా స్థాయి ప్రత్యేకాధికారులతో కలసి పరిశీలించారు. సభకు హాజరయ్యే పింఛన్‌దారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలకు కల్పించిన సదుపాయాలను పర్యవేక్షించారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యంతో పాటు ఇతర ఏర్పాట్లకు సంబంధించి అక్కడ ఉన్న ఆయా విభాగాధిపతులకు సూచనలిచ్చారు. అలాగే హెలిప్యాడ్ నుంచి ఆర్ఎంసీ గ్రౌండ్స్ వరకు జరిగే రోడ్‌షోపై కూడా ఆయన అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రత్యేకాధికారులు, కార్పొరేషన్ యంత్రాంగంతో సమావేశమై చర్చించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఈఈలు మాధవి, వెంకట్రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జిల్లాస్థాయి అధికార యంత్రాంగం కమిషనర్ వెంట ఉన్నారు.

విద్యార్థికి అభినందన




సాయిని అభినందిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు రూరల్: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న ధర్మవరం హైస్కూల్ విద్యార్థిని జి.సాయిని ఎంఈఓ వి.రాజబాబు అభినందించారు. ఎంఈఓ వి.రాజబాబు మాట్లాడుతూ 2023–24కు సంబంధించి కడప జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో జి.సాయి రూపొందించిన రిమోట్ కంట్రోల్ అగ్రికల్చర్ మిషన్‌కు ప్రథమ బహుమతి లభించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆకుల శివకుమార్ వ్యవహరించారని తెలిపారు. ప్రథమ బహుమతి గెలుపొందిన సాయిని ధర్మవరం హై స్కూల్‌లో సీఆర్పీలు రాంజీ, గంగాధర్, ఉపాధ్యాయులు ప్రధాన ఉపాధ్యాయులు కె.చంద్రమూర్తి, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, కె.రాజు, ఉమామహేశ్వరరావు, ఆర్.సూర్యనారాయణ, జాన్సీ పాల్గొన్నారు.

డైనమిక్ లీడర్ సీఎం జగన్

- హామీల అమలే ఇందుకు నిదర్శనం
- ఇక్కడి నుంచే పింఛన్ల పెంపు సంతోషకరం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కాకినాడ: రాజకీయాల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి పనిచేసే నాయకుడిని ప్రజలంతా గుండెల్లో పెట్టుకుంటారని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే కోవకు చెందుతారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. నవరత్న పథకాల ద్వారా ఐదేళ్ల క్రితం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి సభా వేదిక వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి మంగళవారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు. పింఛన్ల సొమ్మును దశలవారీగా మూడు వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాకినాడ నుంచి ప్రారంభించడం మరింత సంతోషదాయకమన్నారు. అవ్వాతాతలతో పాటు ప్రతి పింఛన్‌దారుడు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. సీఎం పర్యటనలో భాగంగా రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి వెంకటజయరామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని, రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ వారధి, రూ.9.5 కోట్లతో నిర్మించిన స్కేటింగ్‌రింక్‌లను ఆయన ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడం ద్వారా సీఎం జగన్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొంది డైనమిక్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

పట్టణాభివృద్ధికి వడివడిగా అడుగులు



తుని పట్టణంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సీపీ సుధారాణి, నాయకులు

తుని: పట్టణంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని 5, 6 వార్డులకు సంబంధించి గొట్టుముక్కలవారి వీధిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ఆమె ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని సీపీ సుధారాణి అన్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు మర్రా సత్యవతి, సూరిశెట్టి సుభద్రాదేవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి పుష్పాలంకరణ




పుష్పాలతో రామలింగేశ్వరస్వామి

గండేపల్లి: తాళ్లూరులో రామలింగేశ్వరస్వామి వారికి మంగళవారం బిల్వాపత్రి, శమీపత్రి, చామంతి పూలతో పుష్పార్చన చేశారు. ప్రజలు పాడిపంటలతో అభివృద్ధిగా ఉండాలని అర్చక స్వామి వివిఎస్ఎన్ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

గండేపల్లి: మురారి కనకదుర్గమ్మను మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వాహనాలపై కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకుని అక్కడే వంట వార్పుచేసుకుని అమ్మవారికి నివేదించి అనంతరం ప్రసాదాలు స్వీకరించి సాయంత్రం వరకు అక్కడే గడిపారు.

ఏలేరులో 79.05 మీటర్ల నీటినిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటినిల్వలు నిలకడగా ఉన్నాయి. మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 79.05 మీటర్లు, 24.11 టీఎంసీలకు 12.37 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇటీవల మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో నీటినిల్వలు పెరిగాయి. దీంతో దిగువ ఆయకట్టుకు 400, విశాఖకు 150 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు నీటిని నిలిపివేశారు.